క్లుప్తంగా

విద్యార్థులకు వాటర్ బాటిళ్లు అందజేత



విద్యార్థులకు వాటర్ బాటిళ్లు అందిస్తున్న హేమసుందర్‌రావు

చీమకుర్తి: లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నూనె హేమ సుందర్‌రావు ఆర్థిక సహకారంతో చీమకుర్తి పట్టణంలోని రామ్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం వాటర్ బాటిళ్లు అందించారు. సురక్షితమైన తాగునీటిని వినియోగించుకునేందుకు వాటర్ బాటిళ్లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. లయన్స్‌క్లబ్ సభ్యులకు హెచ్‌ఎం అంబటి వీరారెడ్డి, స్థానిక టీచర్లు కృతజ్ఞతలు తెలిపారు. లయన్స్‌క్లబ్ కార్యదర్శి చలువాది రమేష్, స్థానికులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

ఒంగోలు సెంట్రల్: బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చెయ్యాలని ఆ పార్టీ నాయకుడు డాక్టర్ ఏలూరి రామచంద్రారావు కోరారు. ఒంగోలులో బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు సురేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, ఒంగోలు అసెంబ్లీ ఇన్‌చార్జి యోగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములపై వివాదం

- దేవదాయ శాఖకు సంబంధం లేదని స్పష్టం చేసిన కమిటీ

మార్కాపురం: మండలంలోని అమ్మవారిపల్లె గ్రామం వద్ద సద్గురు యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ భూముల విషయమై బుధవారం దేవదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. స్వామి వారి భూములు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ నాగమల్లేశ్వరరాజు బుధవారం తన సిబ్బందితో కలిసి బోర్డు ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చిర్లంచర్ల బాల మురళీకృష్ణ, బొగ్గరపు శేషయ్య మరికొందరు గ్రామస్తులు కలిసి దేవదాయశాఖ అధికారులతో మాట్లాడారు. 1958లోనే సద్గురు యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ భూములపై అన్ని రకాల అగ్రిమెంట్లు ఉన్నాయని, ఈ భూములకు దేవదాయ శాఖకు ఎటువంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. స్వామి వారి పేరుతో సేవా సంఘం ఏర్పాటు చేసి, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. తాము భూములు ఆక్రమించలేదని స్పష్టం చేశారు. కాగా అధికారులు, కమిటీ సభ్యుల మధ్య వాగ్వివాదం పోలీసుల వరకు వెళ్లింది.



బస్సులో పులిహోర, వాటర్ బాటిళ్లు తరలిస్తున్న షిరిడీ సాయి కల్చరల్ మిషన్ సభ్యులు



క్విస్, పేస్ కళాశాలల నుంచి ఆహార పొట్లాలు పంపుతున్న జిల్లా సాంఘిక సంక్షేమాధికారి



చీమకుర్తి కాలేజీలో విరాళాలు సేకరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులు

వరద బాధితులకు చేయూత

- పలు పార్టీలు, సంస్థల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విరాళాల సేకరణ

ఒంగోలు టౌన్:

విజయవాడ వరద బాధితులకు చేయూతనందించేందుకు పలు పార్టీలు, సంస్థల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విరాళాల సేకరణ చేపట్టారు. సేవా సదన్ రాష్ట్ర శాఖ తరఫున రూ.5 వేల విరాళాన్ని కుల విమోచన పోరాట సమితి (కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి రఘురాం, జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావులకు అందజేశారు. సేవాసదన్ అధ్యక్షుడు ఎస్.మాల్యాద్రి, కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు కాలే మల్లికార్జునరావు, సేవాసదన్ నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ...

సీపీఎం ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలో విరాళాలు సేకరించారు. నగరంలోని వ్యాపార కేంద్రాలైన గాంధీరోడ్డు, ట్రంకురోడ్డు, బండ్లమిట్ట కేంద్రాల్లో కె.రమాదేవి, రమేష్, జి.శ్రీనివాసరావు, ఎస్‌డీ హుసేన్ తదితరులు పాల్గొని విరాళాలు సేకరించారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో...

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాజు నేతృత్వంలో చీమకుర్తిలో కాలేజీ విద్యార్థుల నుంచి విరాళాలు సేకరించారు.

క్విస్, పేస్ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి...

ఒంగోలు సెంట్రల్: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక క్విస్, పేస్ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో పదివేల ఆహార పొట్లాలను బుధవారం విజయవాడ పంపారు. ఒక్కో కళాశాల నుంచి ఐదు వేల ప్యాకెట్ల చొప్పున అందజేశారు. ఆయా కళాశాలల బస్సులతో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి పంపారు.

ఎంపీ మాగుంట రూ.10 లక్షల విరాళం...

ఒంగోలు అర్బన్: వరద ముంపు ప్రాంతాలకు సహాయం అందించేందుకు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి రూ.10 లక్షల విరాళాన్ని ఆయన ప్రతినిధుల ద్వారా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందజేశారు.

మర్రిచెట్లపాలెంలో విరాళాల సేకరణ...

చీమకుర్తి: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సీపీఎం మండల నాయకుల ఆధ్వర్యంలో బుధవారం మర్రిచెట్లపాలెంలో విరాళాలు సేకరించారు. సీపీఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకట్రావు, తొట్టెంపూడి రామారావు, పల్లాపల్లి ఆంజనేయులు, కృష్టిపాటి చిన్నపురెడ్డి, ఓబులేసు పాల్గొన్నారు.

లాయర్‌పేట సాయిబాబా మందిరం వితరణ...

ఒంగోలు మెట్రో: స్థానిక లాయర్‌పేట షిర్డీ సాయి కల్చరల్ మిషన్ భక్త బృందం వారు దాదాపు 2,500 మంది వరద బాధితులకు పులిహోర బాక్సులు, వాటర్ బాటిళ్లను బుధవారం ఉదయం బస్సులో విజయవాడ పంపించారు. వరద బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో షిర్డీ సాయి కల్చరల్ మిషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రాయపాటి ప్రసాదరావు, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ మల్లాది వెంకట సుబ్బలక్ష్మి, కార్యదర్శి మేడా జయరాం, సభ్యులు శ్రీధర్‌రెడ్డి, వై.సాయిబాబు, గంజాం విజయకుమార్, చాకిరి అంజయ్య, సాయిరాజు, చంద్రారెడ్డి, వాసు ఆచారి తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలులో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు



వరద బాధితులకు విరాళం అందజేస్తున్న సేవాసదన్ ప్రతినిధులు



మర్రిచెట్లపాలెంలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

చిన్నారులందరికీ వ్యాక్సిన్లు వేయాలి

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ పద్మజ

మద్దిపాడు: వెల్‌నెస్ సెంటర్ పరిధిలో ఉన్న ప్రతి ఒక్క చిన్నారికి సరైన సమయంలో వ్యాక్సిన్లు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ పీ పద్మజ సూచించారు. మద్దిపాడుతో పాటు ఇనమనమెళ్లూరు, బసవన్నపాలెం గ్రామాల్లో వ్యాక్సినేషన్ తీరును బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాక్సిన్ల గురించి ఎంఎల్‌హెచ్‌పీలు కూడా తెలుసుకోవాలని, ఏఎన్‌ఎంలతో పాటు వారు కూడా వ్యాక్సిన్ వేయాలని చెప్పారు. జిల్లాలో పలు చోట్ల ఎంఎల్‌హెచ్‌పీలు వ్యాక్సిన్ వేయడం తమ డ్యూటీ కాదన్నట్లు ఉన్నారన్నారు. అందరూ తప్పనిసరిగా వ్యాక్సిన్లు వేయాలని ఆమె తెలిపారు. వ్యాక్సిన్ వేసే విధానాలు, భద్రపరచడం, వ్యాక్సిన్ వైల్ తీసిన తర్వాత ఎంతసేపటి వరకూ దానిని ఉపయోగించవచ్చు, తదితర ప్రశ్నలను ఆమె అడిగారు. వ్యాక్సిన్‌ను భద్రపరిచే తీరుపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఆరోగ్యంపై ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయని తెలిపారు. అందువలన వెల్‌నెస్ సెంటర్లలో ఉన్న వైద్యసిబ్బంది చక్కగా పనిచేయాలన్నారు. ఆమె వెంట సీహెచ్‌ఓ రజితకుమారి, సూపర్‌వైజర్లు బాలకోటయ్య, నాగరాజి, సురేష్, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



బసవన్నపాలెం వెల్‌నెస్ సెంటర్‌లో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ పద్మజ

నీటి పన్ను వసూలు చేయాలి

- డీపీఓ ఉషారాణి



ఈఓపీఆర్‌డీ రఘుబాబుతో మాట్లాడుతున్న డీపీఓ ఉషారాణి

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరం గ్రామంలో నీటి పన్ను వసూలు చేసి వెంటనే టర్న్‌కాక్‌కు, వర్కర్లకు జీతాలిచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఈఓపీఆర్‌డీ రఘుబాబును డీపీఓ టి.ఉషారాణి ఆదేశించారు. బుధవారం దొడ్డవరం గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దొడ్డవరం విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిపాలనను గాడిలో పెట్టాలన్నారు. గ్రామస్తులు పలువురు గ్రామంలోని సమస్యలను ప్రస్తావించగా.. వారితో మాట్లాడారు. దొడ్డవరం గ్రామ పంచాయతీ టర్న్‌కాక్ సుబ్బరాయుడు తనకు 8 నెలలుగా జీతం ఇవ్వలేదని, ఇంటి వద్ద సమస్యలు ఉన్నాయని డీపీఓకు వినతిపత్రం ఇచ్చారు. నీటి సమస్యకు సంబంధించి గతంలో జరిగిన తప్పులు వదిలేసి 2024 జనవరి నుంచి నీటిపన్ను వసూలు చేస్తే సమస్య కొంతవరకూ తీరుతుందని ఆమె తెలిపారు. నీటి పన్ను వసూలు చేసేందుకు వ్యక్తిని నియమించడానికి చర్యలు తీసుకోవాలని ఈఓపీఆర్‌డీకి తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామంలో నీటి పన్ను వసూలు చేసేందుకు ఒక వ్యక్తిని తీసుకోవాలని గ్రామస్తులు కూడా కోరడంతో.. త్వరలో పంచాయతీలో అత్యవసర గ్రామ సభ నిర్వహించి నీటి పన్ను వసూలు చేసేందుకు వ్యక్తిని తీసుకుంటామని, వచ్చిన డబ్బుతో టర్న్ కాక్, ఇతర వర్కర్ల జీతాలు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సెక్రటరీ లతీఫ్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజ్యాంగ సవరణతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య

ఒంగోలు సెంట్రల్: ఆర్టికల్ 341 ప్రకారం రాష్ట్రపతికిగానీ, సుప్రీంకోర్టుకుగానీ రాజ్యాంగ సవరణ చేసిన తర్వాతే ఎస్సీ వర్గీకరణకు వీలుందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టికల్ 341 ప్రకారం బిల్లు పెట్టిన తర్వాతే షెడ్యూల్ కులాలను కలుపుకోవడానికి వీలుందని, విడగొట్టడానికి ఎటువంటి వీలు లేదని తెలిపారు. ఈ నెల 11న వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితికి మద్దతుగా ఒంగోలులో నిర్వహించనున్న ర్యాలీకి ప్రతిఒక్కరూ హాజరై జయప్రదం చెయ్యాలని కోరారు. క్రిమిలేయర్ వలన అన్నదమ్ములుగా కలిసి ఉన్న మాలమాదిగలకు ఇద్దరికీ అన్యాయం జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న అన్ని సంఘాలు ఎకతాటిపైకి వచ్చి వ్యతిరేక పోరాటాన్ని విజయవంతం చెయ్యాలని కోరారు. నూతనంగా ఒంగోలు పట్టణ అధ్యక్షురాలిగా నామాల షకీలాను ఎంపిక చేసినట్లు చెప్పారు. సంఘ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బత్తుల వెంకటరావు, రాష్ట్ర సెక్రటరీ బత్తుల సుబ్రహ్మణ్యం, మున్నార్ మహేష్, చలువాది రాజా, ఫిలిఫ్ తదితరులు పాల్గొన్నారు.

పాలనలో కేంద్ర ప్రభుత్వం ఘోర వైఫల్యం



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

మార్కాపురం: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోజురోజుకూ నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిపోతున్నాయని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం మార్కాపురంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాసరయ్య మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుతానని చెప్పి అధికారంలోకి వచ్చిన మోదీ.. అందుకు భిన్నంగా పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని, మోదీ సంస్కరణల ఫలితంగా చిన్న పరిశ్రమలు మూతపడి లక్షలాది మంది కార్మికులు జీవనోపాధి కోల్పోయారన్నారు. లాభాలు అందిస్తూ ప్రజలకు సేవలందిస్తున్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్లకు కట్టబెడుతోందని మండిపడ్డారు. ఇప్పటికైనా కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్రం విడనాడాలని హితవు పలికారు. అనంతరం సబ్ కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఖాశిం, చిత్తారి పెద్దన్న, దుప్పట్ల కాశయ్య, డి.గోపి తదితరులు పాల్గొన్నారు.

130 మద్యం సీసాలు పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎస్సై అనిత

బేస్తవారిపేట: అర్ధవీడు మండలంలోని కాకర్ల సమీపంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై అనిత తెలిపారు. గన్నెపల్లెకు చెందిన ఒకరు 130 క్వార్టర్ బాటిళ్ల మద్యం అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉరి వేసుకుని యువతి మృతి

నాగులుప్పలపాడు (మద్దిపాడు): మనస్తాపం చెందిన యువతి ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన నాగులుప్పలపాడు మండలంలోని చీర్వానుప్పలపాడు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బత్తుల శిరీష (28) భర్త అంకయ్య సంవత్సరం క్రితం గుండెపోటుతో చనిపోయాడు. అప్పటి నుంచి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులతో కలిసి అత్తమామల వద్దే శిరీష ఉంటోంది. కొంతకాలంగా మనస్తాపం చెంది పరధ్యానంగా ఉంటోంది. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో పిల్లలు నిద్రించిన తర్వాత ఉరి వేసుకుని మృతి చెందింది. ఉదయమే లేచిన ఆమె అత్తమామలు, పిల్లలు గమనించి భోరున విలపించారు. స్థానికులు ఎస్సై బి.శ్రీకాంత్‌కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకుని ఎస్సై పరిశీలించారు. మృతదేహాన్ని కిందకు దింపి పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై దాడి

ఒంగోలు టౌన్: పాత కక్షల నేపథ్యంలో ఒక యువకుడిపై దాడిచేసిన ఘటన నగరంలో బుధవారం సాయంత్రం జరిగింది. బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం ఆ వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని సీతారాంపురంకు చెందిన ధనిశెట్టి జానకిరాం వంటమాస్టర్‌గా పనిచేస్తుంటాడు. స్నేహితుడు ముద్రబోయిన భానుప్రసాద్‌తో కలిసి వంట చేసేందుకు సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో వెళ్తుండగా మార్గం మధ్యలో నగరపాలక సంస్థ కార్యాలయం వద్దకు రాగానే పాత కక్షలను మనసులో పెట్టుకుని పుంజలి దేవా, ఆవుల అనిల్ ఒక్కసారిగా మోటారు బైకును అడ్డం పెట్టారు. దాంతో జానకిరాం కిందపడిపోయాడు. మా మీద కేసులు పెట్టి తిరుగుతున్నావా అంటూ దేవా, అనిల్‌లు జానకిరాంపై దాడికి పాల్పడ్డారు. అదే సమయంలో వెనకనుంచి వారిని అనుసరిస్తూ వచ్చిన డేవిడ్ బిల్లా, శివ కూడా దాడికి దిగారు. కర్రలతో కొట్టడంతో జానకిరాంకు గాయాలయ్యాయి. గట్టిగా కేకలు వేయడంతో నిందితులు పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ వై.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి వృద్ధుడు మృతి

రాచర్ల: రైలు కింద పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని సత్యవోలు గ్రామంలో బుధవారం వెలుగు చూసింది. వివరాలు.. సత్యవోలు గ్రామానికి చెందిన యడవల్లి పోలయ్య(70) అనే వృద్ధుడు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రైలు పట్టాలపై పోలయ్య మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.